ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.9, కనిష్ఠం 20.4
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 11 ఫిబ్రవరి 2025



వరద కెనాల్‌కు 2500 క్యూసెక్కుల నీటి విడుదల

ముప్కాల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు సోమవారం 2500 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు డీఈ గణేష్ తెలిపారు. కాకతీయ కాలువకు జూన్ రెండు చివరి ఆయకట్టు కోసం నీటిని విడుదల చేస్తున్నారు. వరద కెనాల్ 88.470 కిలోమీటర్ వద్ద లింక్ కెనాల్ నిలిపి కాకతీయ కాలువకు నీటిని మళ్లించనున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091అడుగులు (80.5టీఎంసీ)లు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1079.50అడుగులు (43.66టీఎంసీ) నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ముగిసిన నామినేషన్లు





- గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ ఘట్టం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 100
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 18 నామినేషన్ల దాఖలు
- ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే పోటీ

నిజామాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ఘట్టం ముగిసింది. మంగళవారం నామినేషన్లను పరిశీలించనున్నారు. ఈ దఫా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి భారీగా నామినేషన్లు దాఖలుకాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కొద్దిమందే నామినేషన్లు వేశారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో జరిగే ఈ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా స్వతంత్రులు కూడా ఎక్కువ మంది నామినేషన్లు వేశారు. ఈ ఎన్నికల్లో పోటీలో ఉండేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్ విత్‌డ్రా సమయం ముగిసిన తర్వాత అభ్యర్థులను కరీంనగర్‌లోని ఎన్నికల అధికారులు ప్రకటించనుండగా నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల్లో పోటీ పడకపోవడం వల్ల ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర అభ్యర్థుల మధ్యనే పోటీ కొనసాగనుంది.

గ్రాడ్యుయేట్ స్థానానికి 100 సెట్ల నామినేషన్లు

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 100 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 18 నామినేషన్ల సెట్లను వేశారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు, ఉద్యోగులకు సంబంధించి శిక్షణను అందించారు.

కాంగ్రెస్ తరఫున ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కాంగ్రెస్ తరఫున ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఆయన ఉమ్మడి నాలుగు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి నామినేషన్లను దాఖలు చేశారు. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో గత కొన్ని నెలలుగా గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుస్తూ మద్దతును కూడగడుతున్నారు. కాంగ్రెస్ టికెట్ ప్రకటన వెలువడకుముందే ఆయన ఈ ప్రయత్నాలు చేశారు. గ్రాడ్యుయేట్‌లను ఓటర్లుగా చేయించడంతో పాటు గట్టి పోటీ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, సిట్టింగ్ స్థానం కావడంతో మళ్లీ నిలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కార్పొరేషన్ చైర్మన్‌లు, సీనియర్ నేతలకు ఇన్‌చార్జిలుగా నియమించి మండలాల వారిగా గ్రాడ్యుయేట్ ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల పరిధిలో సమావేశాలు నిర్వహించిన పార్టీ నేతలు ప్రచారం మరింత గట్టిగా చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి స్థాయిలో గ్రాడ్యుయేట్‌ల మద్దతును కూడగట్టడంతో పాటు ప్రభుత్వం వారికి చేస్తున్న పనులను వివరించడం చేస్తున్నారు. ఎలాగైనా ఈ సీటును మళ్లీ నిలుపుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో పట్టు నిలుపుకుంటే ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆ ప్రభావం ఉంటుందని వారు అంచనాకు వస్తున్నారు.

బీజేపీ నేతల ముమ్మర ప్రయత్నాలు

కాంగ్రెస్‌కు దీటుగానే బీజేపీ నేతలు కూడా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో పార్టీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అంజిరెడ్డితో పాటు ఉపాధ్యాయ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్క కొమురయ్యను గెలిపించేందుకు పావులు కదుపుతున్నారు. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో నలుగురు ఎంపీలు ఉన్నారు. వీరితో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీని గెలుచుకుంటే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు వచ్చే ఇతర ఎన్నికల్లో కూడా తమకు కలిసి వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎలాగైనా ఈ దఫా ఈ రెండు సీట్లను గెలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీకి చెందిన అనుబంధ సంఘాలన్నింటిని రెండు నెలల క్రితమే రంగంలోకి దించిన పార్టీ నేతలు ప్రస్తుతం నామినేషన్ ఘట్టం పూర్తి కావడంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో ఆయా మండలాలకు ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు గ్రాడ్యుయేట్‌లతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం ఓటర్ల మద్ద తును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు. ఈ దఫా ఈ సీట్లను గెలుచుకుంటే భవిష్యత్తులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు కలిసి వస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఈ ఎన్నికల కోసం దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కీలక నేతలందరూ నియోజకవర్గంలో ఉండి పనిచేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

స్వతంత్రుల నుంచి కూడా గట్టి పోటీ

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే పోటీ ఉంటుండగా వీరికి ఇద్దరు లేదా ముగ్గురు స్వతంత్రుల నుంచి కూడా గట్టి పోటీ కనిపిస్తోంది. కాంగ్రెస్ తరఫున నరేందర్‌రెడ్డి, బీజేపీ తరఫున అంజిరెడ్డి పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ప్రసన్న హరికృష్ణ, సర్దార్ రవీందర్‌సింగ్, యాదగిరి శేఖర్‌రావులు కూడా నామినేషన్లు వేశారు. వీరితో పాటు మరికొంత మంది స్వతంత్రులు వేశారు. ప్రధానంగా పార్టీలకు దీటుగా పోటీ ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా వీరు వివిధ రంగాల్లో పనిచేస్తూ గ్రాడ్యుయేట్‌కు అండగా ఉంటున్నారు. నామినేషన్లు వేసిన వీరిని విత్‌డ్రా చేయించేందుకు కాంగ్రెస్‌తో పాటు బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. మిగతా స్వతంత్రుల నుంచి ఇంకాపోటీ వచ్చే అవకాశం లేకున్నా వీరి నుంచి మాత్రం గట్టి పోటీ ఉండనుండటంతో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు మాత్రం పోటీలో ఉండేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ దఫా బీఆర్‌ఎస్ పోటీలో లేకపోవడం వల్ల ఆ పార్టీ నేతలు ఏ పార్టీకి మద్దతు ఇస్తారోనని చర్చ కొనసాగుతోంది. ముగ్గురు స్వతంత్రులకు బీఆర్‌ఎస్ నేతలతో సంబంధాలు ఉండటం సర్దార్ రవీందర్ సింగ్ బీఆర్‌ఎస్ తరఫున కరీంనగర్ మేయర్‌గా పనిచేసి ఉండటం వల్ల పార్టీలోని కొంత మంది ఈ ముగ్గురికి పనిచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

తెలంగాణలో కులగణన పంచాయితీ ఎక్కువైంది

● ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేయించిన కులగణన అదొక సర్వే కాదని తెలంగాణలో కులగణన పంచాయితీ ఎక్కువైందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఢిల్లీలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసీఆర్ కులం పెద్దదని ఆయనని సీఎం చేయలేదని తెలంగాణ కోసం కొట్లాడాడని ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. ఆయన పదేళ్ల పాలన ఆయన పిల్లల గుణం బాగా లేదని ప్రజలు ఓడించారని రాజకీయాల్లో కులం కన్న గుణం ముఖ్యమని ఆయన అన్నారు. రాజకీయాల్లో ఎక్కడ కులం పంచాయితీ ఉన్నా.. బీజేపీలో మాత్రం ఉండకూడదన్నారు. బీజేపీలో జాతీయభావం ఒక్కటే ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులాల వారీగా నెంబర్లను అధికారికంగా విడుదల చేయకముందే లీక్‌లు ఇస్తుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి దమ్ముంటే కులగణన నెంబర్లను అధికారికంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కులగణన నెంబర్లను విడుదల చేస్తే అవి తప్పని తాను గంటల్లో నిరూపిస్తానని అన్నారు. రాష్ట్రంలో అసలు క్రిస్టియన్లు లేరా అని ఆయన ప్రశ్నించారు. సీఎం చెప్పిన లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3కోట్ల 54లక్షల 75వేల 554 మంది కాగా ఓటర్లు 3కోట్ల 35లక్షల 27వేల 925 మంది ఉన్నారని వారి లెక్కల ప్రకారమే సుమారు 19 నుంచి 20లక్షల మంది నాన్ ఓటర్లు ఉన్నారని అన్నారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం 0 నుంచి ఆరేళ్లలోపు వయస్సుగల వారు 39లక్షల మంది ఉన్నారని ఆయన విమర్శించారు. ఈ లెక్కలతోనే ప్రభుత్వం చేసిన కులగణన సర్వే తప్పుల తడకగా ఉందని అర్థమవుతుందని ఎంపీ అన్నారు.

రేపు కమ్మర్‌పల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

- 13న పోలేరమ్మ జాతర
- వీడీసీ ఆధ్వర్యంలో వసతుల ఏర్పాటు

7

వృద్ధాప్యంలో ఉన్న వారిని ప్రేమతో ఆదరించాలి

● త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న వారిని ప్రేమతో ఆదరించాలని, అప్యాయంగా మాట్లాడాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. మండలంలోని అంకాపూర్ లాలన వృద్ధాశ్రమాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. వయస్సు పైబడిన వారిని ప్రేమతో పలకరిస్తే సగం రోగాలు దూరమవుతాయన్నారు. ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక కార్డు ప్రవేశపెట్టిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైలు ప్రయాణంలో చార్జీలు తగ్గించడంతో పాటు బెర్త్ సౌకర్యం, ఆలయాలు, ఓటింగ్ సమయాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవలందించిన వారిని ప్రజలు ఎల్లవేళల గుర్తుంచుకుంటారన్నారు. ఎందరో వృద్ధులను అక్కున చేర్చుకొని ఆశ్రయం కల్పించిన స్వర్గీయ రాజారెడ్డి ప్రజల మనస్సులో ఉన్నారన్నారు. అంతకు ముందు గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఆశ్రమం కలియతిరిగి పరిశీలించారు.

సిద్దులగుట్టపై ఇంద్రసేనారెడ్డి పూజలు

పట్టణంలోని సిద్దులగుట్టపై త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు గవర్నర్‌కు ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, బద్దం లింగారెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, విజయ్ విద్యాసంస్థల ప్రమోటర్ అమృతలత, లాలన వృద్ధాశ్రమ నిర్వాహకులు సునీతరెడ్డి పాల్గొన్నారు.



సిద్దులగుట్టపై పూజలు చేస్తున్న ఇంద్రసేనారెడ్డి, పక్కన ఆర్మూర్ ఎమ్మెల్యే

వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

మాక్లూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులోని శ్రీ అపురూప వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం త్రిపుర గవర్నర్ ఇంద్ర సేనారెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పూజలు చేసి పండితుల ఆశీర్వచనాలు పొందారు. అనంతరం గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆర్టీసీ కాలనీలో ఏర్పాటు చేసిన 12అడుగుల హన్మాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అమృతలతరెడ్డి, విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఇందూరు తిరుమలకు ఇంద్రసేనారెడ్డి

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయానికి త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మంగళవారం రానునట్లు ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహించే ఉత్సవంలో గవర్నర్ పాల్గొంటారని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

● అధికారుల శిక్షణ తరగతుల్లో కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్‌ల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో సోమవారం మొదటి దశ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్వోలు నోటిఫికేషన్ జారీ చేసి ఆరోజునుంచే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లను స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ భవనాలను ముందుగానే ఎంపిక చేసుకొని నోటిఫి కేషన్‌లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్వోలు, సహాయ ఆర్వోలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఇందులో ఆర్‌డీవో రాజేంద్రకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఈవో అశోక్, డీఎల్‌పీవోలు, ఆర్‌వోలు, సహాయ ఆర్‌వోలు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కులగణనపై ప్రతిపక్షాల అనవసర రాద్ధాంతం

- బీసీలకు న్యాయం జరిగేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసింది
- రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

8

శిథిలావస్థకు వేల్పూర్ పోలీసు క్వార్టర్లు

7

- కూలడానికి సిద్ధంగా భవనాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నగరంలో భూమిపూజ చేస్తున్న విద్యారణ్య స్వామి, వేద పండితులు

వారాహి అమ్మవారి ఆలయ శంకుస్థాపన

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి ఆధ్వర్యంలో పూజలు

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ వారాహి దేవి అమ్మవారి ఆలయ శంకుస్థాపన శాస్త్రోక్తంగా సాగింది. జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లోని వెంచర్‌లో సోమవారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు పశుపతిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి స్వామీజీ మాట్లాడు తూ.. హైందవ ధర్మంలో ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని దాన్ని కా పాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కల్యాణో త్స వంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. అమ్మదయ ఉంటే ప్రతి ఒక్కరికీ అన్ని శుభాలు చేకూరుతాయన్నారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, మాంచాల శంకరయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జ్ఞానేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భగవంతుని నామస్మరణ చేయాలి..

వర్ని : ప్రతి ఒక్కరూ భగవంతుని నామస్మరణ చేయాలని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి మహాస్వామి పిలుపునిచ్చారు. వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి శివాలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

దళారీ దందా



- జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పెరుగుతున్న అవినీతి
- మధ్యవర్తులు లేనిదే ముందుకు కదలని ఫైల్
- నేరుగా వెళ్తే తప్పని ఇక్కట్లు
- చేతులు తడిపితేగానీ జరగని రిజిస్ట్రేషన్
- అందుకు కొందరు డాక్యుమెంట్ రైటర్ల సహకారం
- కొనుగోలుదారులకు తప్పని తిప్పలు

ఖిల్లా, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారీ దందా రాజ్యమేలుతోంది. చేతులు తడపందే ఫైళ్లు కదలడం లేవు. అన్ని సక్రమంగా ఉన్న డాక్యుమెంట్లకు సైతం కొర్రీలు పెడుతూ వాటిని పక్కన పెడుతున్నారు. స్లాట్ తీసుకున్న డాక్యుమెంట్లకు అదేరోజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సిన అధికారులు.. వాటిని పక్కన పెడుతున్నారు. అదే రోజు పనులు జరగాలంటే కొందరు డాక్యుమెంట్ రైటర్లు సహకారం అందించి కొనుగోలుదారులకు నచ్చ చెప్పి వారి వద్ద నుంచి వేల రూపాయల్లో వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కొత్తగా సబ్‌రిజిస్ట్రార్లుగా బదిలీపై వచ్చిన అధికారులు రోజుకు వేలల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఇష్టారాజ్యంగా పనులు..

జిల్లా కేంద్రంలోని అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డాక్యుమెంట్లకు ఎక్కువ డబ్బులు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్న అధికారులు.. అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ డాక్యుమెంట్లను పక్కకు పెట్టి కాలయాపన చేస్తున్నారు. కార్యాలయం సమయం ముగిసిన అనంతరం వాటికి ఎక్కువ డబ్బులు వసూలు చేసి డాక్యుమెంట్లకు నంబర్లు వేసి పనులు పూర్తి చేస్తున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. ఇలా పక్కకు పెట్టిన డాక్యుమెంట్లకు ఒక్కక్కటికి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దందాలో కొందరు డాక్యుమెంట్ రైటర్లు!

రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాలు చేయడానికి అధికారులు తమకు సన్నిహితులుగా ఉన్న కొందరు డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కు అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి ద్వారా కార్యాలయాలకు వెళ్తేనే పనులు చక చక జరుగుతాయని పలువురు తెలిపారు. ఆ అధికారి జిల్లా కేంద్రంలోని పలువురు తమకు నమ్మినబంటులుగా ఉన్న వారితో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అధి కారి జిల్లా కేంద్రానికి చెందిన వాడు గా ఉండడంతో తన తో అత్యంత సన్నిహితంగా ఉండే డాక్యుమెంట్‌రైటర్లు ఏది చెబితే అది వెంటనే చేస్తున్నాడని కొందరు వాపోతున్నారు. అదే విధంగా కొందరు డాక్యుమెంట్ రైటర్లతో పాటు ఓ ప్రైవేటు వ్యక్తిని సైతం నియమించుకుని ఆయన ద్వారా ప్రతిరోజూ చేసిన డాక్యుమెంట్ల డబ్బులను సాయంత్రం వసూలు చేయిస్తున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకే..

రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న అధికారిణి కొంతకాలంగా దీర్ఘకాలిక సెలవు పెట్టడం వల్ల ఆ స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా కేంద్రంలో ఉండే మరో ఉన్నతాధికారికి అప్పగించారు. అయితే ఆ అధికారి అంతగా పట్టించుకోకపోవడంతో అధికారుల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. పైగా ఉన్నతాధికారులకు ప్రతినెలా రూ.లక్షల్లో డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని, వారికి చెందిన ఖర్చులు మేమే భరించాల్సి ఉంటుందని బయట కొనుగోలుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

బోధన్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



బోధన్‌లో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని సరస్వతినగర్‌లో విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వబ్రహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విశ్వకర్మ భగవానుడిని ఆశీర్వాదలు తీసుకున్నారు. అనంతరం యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ చారి, సంఘ వ్యవస్థాపకులు రాందాస్‌చారి, శివాలయం చైర్మన్‌హరికాంత్ చారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం కార్యదర్శి సుధాకర్ చారి, కోశాధికారి అశోక్ చారి తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కితీసుకోవాలని నిరసన



వేల్పూర్‌లో నిరసన తెలుపుతున్న అంబేద్కర్ సంఘ సభ్యులు

వేల్పూర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని వేల్పూర్ మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఉన్నత విద్యరంగానికి నష్టం కలిగించేలా యూజీసీ రూపొందించిన ముసాయిదాను తక్షణమే వెనక్కి తీసుకోవాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు జె.ప్రభాకర్ కోరారు. విశ్వవిద్యాలయాల్లో కార్యాకలాపాల్లో గవర్నర్‌కు ప్రాధాన్యం కల్పించడం, భారత రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రపంచాన్ని నడిపించేది విద్య ఒక్కటే అనే విషయాన్ని ప్రతీఒక్కరు గుర్తుంచుకోవాలని, అలాంటి విద్య వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సరిపడే నిధులు కేటాయించడం లేదన్నారు.ఈకార్యక్రమంలో అంబేద్కర్ మండల ప్రధానకార్యదర్శి జంబావా చామర్, ఉపాధ్యక్షుడు శివకృష్ణ పాల్‌రాజ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో ప్రవేశాలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధి లోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూరవిద్యా కేంద్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు రెండవ దఫా అవకాశం కల్పించడం జరిగిందని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఓయూసీడీఈ.నెట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఇతర వివరాలకు అధ్యయన కేంద్ర సమన్వయకర్త రాము 9912670252 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమురయ్యను గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని తెలిపారు. పట్టణంలో ఉన్న పట్టభద్రులు, టీచర్‌లను కలిసి బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసేలా అభ్యర్థించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు విపుల్‌జైన్, నరేందర్ రెడ్డి,లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

భిక్కనూరు: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి బీజేపీ ప్రతికార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీజేపీ జిల్లా నాయకులు నరేందర్, మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండలకేంద్రంలోని రెడ్డిఫంక్షన్‌లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఓటరు వద్దకు తప్పకుండా వెళ్లి బీజేపీ ఓటు వేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నాళేశ్వర్‌లో భక్తులకు ప్రవచనాలు అందజేస్తున్న మంగిరాములు మహరాజ్

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన సహిత దత్తాత్రేయ, పోచమ్మ దేవి ఆలయాల శిఖర ప్రతిష్టాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల పూజ, యంత్ర, మూర్తి ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, మహాపూజ, బలి, మహ పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిపేట ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగిరాములు మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రవచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రెంజల్: పోచమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్టాపన మహోత్సవం సోమవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్ద పోచమ్మ, చిన్న పోచమ్మ విగ్రహాలతో పాటు నవగ్రహాలను వేద పండితుల సమక్షంలో ప్రతిష్ఠించారు. గ్రామ పొలిమేర నుండి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్దకు తీసుకువచ్చి నూతన విగ్రహాలను ప్రతిష్టాపన నిర్వహించారు. గ్రామంలో అందరు సుఖశాంతులతో ఉండేందుకు హనుమాన్ మందిరంలో నవగ్రహాలతో పాటు పెద్ద పోచమ్మ, చిన్న పోచమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించడం జరిగిందని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కమటం గంగారాం, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నందకుమార్ తెలిపారు. నవగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి గ్రామస్థుల ఆధ్వర్యంలో 14గంటలు యజ్ఞంలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మంగళ హారతులతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షులు నితిన్, బీజేపీ మండల అధ్యక్షులు గోపికృష్ణ, మాజీ ఉప సర్పంచ్ లత సాయిలు, సొసైటీ డైరెక్టర్ బుడ్డోళ్ల సాయిలు, అబ్బగోని గంగాధర్ గౌడ్, ప్రేమ్‌కుమార్, అనిల్, బాలకృష్ణ, సంతోష్, సాయిలు, గంగాదర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే కాంగ్రెస్ ధ్యేయం



గ్రామాలలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని బర్దీపూర్, పెంటాకలాన్, పెగడాపల్లి, మావందికలాన్, మావందిఖుర్దు, తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నాయకులకే పట్టం కట్టాలన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను, ప్రజల ఇబ్బందులను తెలుసుకునేందుకే తాము గ్రామాల పర్యటన చేపట్టామని అన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వం పదేళ్లకాలంగా గ్రామాలను అభివృద్ధి చేయడంలో విఫలమైందని అందుకే ప్రజలు ఆ పార్టీని ఫాంహౌస్‌కు పరిమితం చేశారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, నాయకులు దాము, సంజీవ రెడ్డి, అల్లె రమేష్, సుదర్శన్, తాళ్ల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి సమాన హక్కులు ఉన్నాయి

● ఐసీడీఎస్ సీడీపీవో జానకి



విద్యార్థులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

సాలూర,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లలు మగ పిల్లలతో సమానమని ఇద్దరికి సమాన హక్కులు ఉన్నాయని బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో జానకి అన్నారు. సోమవారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బేటి బచావో, బేటి పడావో పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అవగాహన కల్పించారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని టీమ్‌ను ఉద్దేశించి ఐదు ఉద్దేశాలను తెలుపుతూ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లల యొక్క లింగ నిష్పత్తిని తగ్గించడాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. శిశు భ్రుణ హత్యల గురించి వివరించారు. చదువు యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు పెళ్లిళ్లు చేయడం వల్ల భ్రుణహత్యలకు పాల్పడడం, ఆడపిల్లలు, పసి పిల్లల మరణాలు ఎక్కువై అవుతుందని అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి,హెచ్‌ఎం మంజూష, అంగన్‌వాడీ టీచర్లు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సైంటిస్ట్ కావాలంటే విద్యార్థి దశ నుంచే

ఆలోచన విధానంలో మార్పు రావాలి



నందిపేటలోని రాకెట్లను పరిశీలిస్తున్న ఎంఈవో గంగాధర్

నందిపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సైంటిస్టులు(శాస్త్రవేత్తలు) కావాలంటే విద్యార్థి దశ నుంచే ఆలోచన విధానంలో మార్పులు రావాలని మండల విద్యాధికారి అవధూత గంగాధర్ తెలిపారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా కలాం ఇన్సిస్టూట్ ఆఫ్ యూత్ ఎక్సలెంట్ సహకారంతో డీఆర్‌డీవో, ఇస్రోలలో తయారైన మిసైల్స్, సాటిలైట్స్, మాంగల్యాన్, ఆర్యభట్ట, బ్రహ్మోస్, చంద్రయాన్‌తో పాటు 20 మోడల్స్‌లను పాఠశాలలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా, డీఆర్‌డీఓ, ఇస్రో సెంటర్లను సందర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు 1600 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజూరి అరుణ్, ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి రమేష్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



రుద్రూర్‌లో చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆరుగురు లబ్దిదారులకు సీఎం రిలీఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడప సాయిలు, పత్తి రాము, పత్తి లక్ష్మణ్, తోట సంగయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



నవీపేటలో పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహించిన దృశ్యం



నాళేశ్వర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం



నవీపేట నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ పిట్ల కృష్ణ మహరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● నవీపేటలో లక్ష్మినరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు, ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● బాగేపల్లిలో రామాలయ మొదటి వార్షికోత్సవం

రెంజల్: మండలంలోని బాగేపల్లి గ్రామంలో అభీష్ట రామాలయం మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రామాలయాన్ని ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి కావడంతో మూడు రోజులు పూజ కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం చేపట్టారు. గ్రామంలోని మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు సాయాగౌడ్, గోపాల్, మాజీ సర్పంచ్ గాండ్ల సాయిలు, ఆగంటి సాయిబాబా గౌడ్, సురేందర్ గౌడ్, గోపి, సాయిలు, రంజిత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కేంద్ర మంత్రి, సీఎం దిష్టిబొమ్మల దహనం



భీమ్‌గల్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలల సంఘ నాయకులు

భీమ్‌గల్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ మంత్రి మండలి ఆమోదం తెలపడంను అసెంబ్లీ శమీమ్ అక్తర్ కమిటీ నివేదికను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ భీమ్‌గల్ మండలంలోని మాల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల మాల సంఘం అధ్యక్షుడు బీమ్ రవీందర్, బట్టు అనిల్‌లు మాట్లాడుతూ గతంలో ఆరు శాతం మాలకు రిజర్వేషన్ ఉంటే ఇప్పుడు దానిని ఐదు శాతానికి తగ్గించడం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, మాలల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టుతూ సీఎం రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ రాబోయే ఎమ్మెల్సీ ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేసి కాంగ్రెస్ ఓటమి కోసం మాలలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కండె కాంతయ్య, కునే రమేస్, బద్దం అనిల్, కార్తిక్, చిత్తారి ఆనంద్, బట్టు సునీల్, గొట్టి పృథ్వీ, గోలి నరేష్, రాజారాం, సృజన్, రాహుల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గేదె మృతి



బస్సు ఢీకొని మృతి చెందిన గేదె

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి చెందింది. సోమవారం ఆర్మూర్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెర్కిట్ సమీపంలో రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

బీఆర్‌ఎస్ జెండాతో కుంభమేళా

తరలివెళ్లిన యంచ గ్రామస్థులు



ప్రయాగ్‌రాజ్‌లో యంచ గ్రామస్థులు

నవీపేట,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచకు చెందిన పలువురు గ్రామస్థులు ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు తరలివెళ్లారు. రెండు ప్రత్యేక బస్సులలో సుమారు 40మంది కుంభమేళాలో పుణ్యస్నానాలు చేయడానికి తరలివెళ్లారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు పలువురు యంచ గ్రామస్థులు బీఆర్‌ఎస్ జెండా పట్టుకుని గంగానది వద్దకు వెళ్లారు. అనంతరం త్రివేణి సంగమంలో వారు పుణ్యస్నానాలు ఆచరించి బీఆర్‌ఎస్ జెండాపై సైతం గంగా జలం చల్లారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని పుణ్యక్షేత్రంలో మొక్కుకున్నట్లు పలువురు యంచ గ్రామస్థులు పేర్కొన్నారు.

తడిపొడి చెత్తపై విద్యార్థుల ర్యాలీ



తడిపొడి చెత్తపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు తడిపొడి చెత్తపై ర్యాలీ నిర్వహించారు. తడిపొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను విభజించి మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేయాలని విద్యార్థులు ప్రజలకు సూచించారు. అలాగే ప్లాస్టిక్‌పై జరిగిన అనార్థాలను వీదికుక్కలతో ఉండాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులచే మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, వార్డు ఆఫీసర్ అవినాష్, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇంటర్ విద్యార్థి మృతి

● పుట్టిన రోజు నాడే మృతి చెందడంతో కుటుంబంలో విషాదం

నవీపేటఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(బి)కి చెందిన కళ్లెం అభిషేక్(17)అనే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఎస్ఐ వినయ్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బాపూర్(బి)కి చెందిన కళ్లెం అభిషేక్‌కు చదువుపై అంతగా ఇష్టం లేదు. గత సంవత్సరం ఆర్మూర్‌లోని ఎస్సీ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీలో చదవగా ఎక్కువ సబ్జెక్టులలో ఫెలయ్యాడు. అయినప్పటికీ తండ్రి బలవంతంగా ఈ సంవత్సరం మండల కేంద్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ కోర్సులో చేర్పించాడు. తనకు చదువుకోవడం ఇష్టం లేదని తరుచుగా తోటి వారితో చెప్పుకునే వాడు. అభిషేక్ గత నెల 27న తన ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు సేవించగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడు అభిషేక్ అంత్యక్రియలను సోమవారం అతడి స్వగ్రామమైన అబ్బాపూర్(బి)లో నిర్వహించారు. ఈ అంత్యక్రియలలో మండల కేంద్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన పలువురు తోటి విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. అభిషేక్ పుట్టిన రోజు నాడే మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులను కలిచివేసింది. తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



అభిషేక్(ఫైల్)

విద్యార్థుల పాలిట వరం.. మోడల్ పాఠశాలలు



మేనూర్ మోడల్ పాఠశాల

మద్నూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మోడల్ పాఠశాలలు గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాలిట వరంగా మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల వసతులతో నాణ్యమైన విద్యా బోధన అందిస్తుండటంతో ఏటా మోడల్ పాఠశాలలో చేరే విద్యార్థులు సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. విద్యా సంవత్సరానికి ఆరు నుంచి పదవ తరగతి సీట్ల భర్తీకి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మెరుగైన వసతులతో పాటు పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన అంది స్తుండటం, ఫీజుల భారం తగ్గుతుండటంతో ఈ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

● జిల్లాలో ఆరు మోడల్ పాఠశాలలు

కామారెడ్డి జిల్లాలో ఆరు మోడల్ పాఠశాలలు ఉన్నాయి. మద్నూర్ మండలం మేనూర్, నిజాం సాగర్ మండలం అచ్చంపేట, బాన్సువాడ మండలం, ఎల్లారెడ్డి మండలం, అలాగే గోపాల్‌పేట్ మండలం సదాశివనగర్ మండలాల్లో స్కూళ్ళు విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరవ తరగతిలో 100 సీట్ల చొప్పున జిల్లాలో 600 సీట్లను భర్తీ చేయ నున్నారు. 7వ పదవ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు.

● 28 వరకు దరఖాస్తుల ఆహ్వానం

● అన్ని వసతులతో మోడల్ పాఠశాలలు

మోడల్ పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన ఉంటుంది. గ్రంథాలయాలు, ఆధునాత వ్యాధులు, డిజిటల్ తరగతులు, తరగతి గదులు, ఆట స్థలం, ఉచిత భోజన హాస్టల్ వసతులు ఉన్నాయి. పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వడం, 5వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్, ఐఐటీ కోచింగ్ ఇస్తున్నారు.

● పరీక్ష సిలబస్ విధానం

6వ తరగతి ప్రవేశ పరీక్షకు 5వ తరగతి సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. తెలుగు 25 మార్కులు, ఇంగ్లీష్ 25 మార్కులు ఉంటాయి. ఈవీఎస్ 25, గణితం 25 మార్కులు ఉంటాయి. ఏడో తరగతి నుంచి పదో తరగతి ప్రవేశ పరీక్షలో అంతకంటే వెనుక తరగతి సిలబస్ సంబంధించిన ఇంగ్లీష్ 25 మార్కులు, గణితం 25 మార్కులు, జనరల్ సైన్స్ 25 మార్కులు, సోషల్ స్టడీస్ 25 మార్కులు ఉంటాయి.

● తుది గడువు ఈ నెల 28 వరకు

ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు దర ఖాస్తుల స్వీకరణ ఈ నెల 28తో ముగియనుంది. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. ధ్రువీకరణ పత్రాలతో మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఓపెన్ కేట గిరికి చెందిన విద్యార్థులు రూ.200 బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు రూ.125 ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏడ వ తరగతి నుంచి పదో తరగతి ప్రదేశాల కోసం పరీక్ష రాసే విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు.



మేనూర్ మోడల్ పాఠశాలను జనవరిలో సందర్శించిన ప్యానల్ టీమ్ సభ్యులు (ఫైల్)



ముస్తాబైన ఆలయం

వైభవంగా బంగారు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ముప్కాల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో శ్రీబంగారు వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్నాయి. గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని రంగులతో, వివిధ రంగుల పువ్వులతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పూజారి రామకృష్ణ రామానుజాచారి ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉమ్మడి బాల్కొండ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బంగారు వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా ఐదు రోజుల పాటు జరుగతాయి. ఈనెల 9న అంకురారోహణం, దేవతాహ్వానం, ధ్వజా రోహణ, అగ్రిప్రతిష్ట, సాయంత్రం నిత్య హవనం, బలిహరణం, 10న మండప రాధ న, శతకాల అభిషేకం, సాయంత్రం నిత్యహవనం, బలిహరణం, తర్థీప్రసాత విత రణ, 11న నిత్యహవన బలిహరణం, సాయంత్రం రథ హోమం, రథప్రతిస్ఠ, రథో త్సవం, 12న ఉదయం ముత్యాల తలంబ్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత తీరు క ల్యాణ మహోత్సవం జరగనుంది. 13న నిత్యహవనం, మహాపూర్ణహుతి, చక్ర స్నా నం, మహా అన్నదానం, సాయంత్రం నాగవెళ్ళి, ఏకాంత సేవా వంటి కార్యక్రమా లు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నబ్రహ్మంగారి దేవాలయం

రేపు కమ్మర్‌పల్లిలో వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

●13 న పోలేరమ్మ జాతర

● భక్తుల సౌకర్యార్థం వీడీసీ ఆధ్వర్యంలో వసతుల ఏర్పాటు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి గ్రామ శివారులోని శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కాలజ్ఞాని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం, రథోత్సవం, జాతర బుధవారం జరుగుతుందని వీడీసీ బోగ రామస్వామి, కోశాధికారి బుచ్చిమల్లయ్య, కొత్తపల్లి గణేష్, తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజు గుట్టపై యజ్ఞ కార్యక్రమాలు జరుగుతున్నాయని సోమవారం ఉదయం జరిగిన ప్రత్యేక పూజలు స్వామివారి యజ్ఞ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు గ్రామస్థులు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు దంపతులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం గుట్టపైగల స్వామివారి ఆలయంలో బ్రహ్మంగారు, గోవిందమ్మల కల్యాణోత్సవం, ప్రత్యేక పూజలు, మహాయజ్ఞం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, స్వామివారి కల్యాణం, జాతర ఉత్సవాల సందర్భంగా గుట్టపై భక్తుల సౌకర్యార్థం తాగునీటి, నీడ తదితర అన్ని వసతులను కల్పించినట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం స్వామివారి కల్యాణం, సాయం త్రం గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి గుట్ట వరకు స్వామివారి రథోత్సవ ఊరేగింపు ఉంటుందని భక్తులు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కల్యాణం, జాతర, రథోత్సవం, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వీడీసీ సభ్యులు కోరారు. కాగా 13న గురువారం గుట్టపై కొలువుదీరిఉన్న పోలేరమ్మ జాతర జరుగుతుందని ఆలయ అర్చకులు విశ్వజ్ఞ ఎస్ఆర్ అనిల్ తెలిపారు.



గుట్టపై సతీసమేతంగ కొలువుదీరిన పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి

ఖిల్లా రామాలయాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

● సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద బ్రహ్మణులు



మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి


డిచ్‌పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక ఖిల్లా రామాలయాన్ని టూరిజం హబ్‌గా ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపుతానని రామాలయ విశిష్టతను అపురూప కట్టడాలనిర్మాణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖలకు వివరించి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని రాష్ట్ర పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. సోమవారం ఖిల్లా డిచ్‌పల్లిలో నిర్వహిస్తున్న చారిత్రాత్మక సీతారాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణానికి రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డితో కలిసి పటేల్ రమేశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాలయంపై స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఖిల్లా డిచ్‌పల్లి రామాలయాన్ని అ భివృద్ధి చేసేలా కృషి చేస్తానని ఆలయానికి జాతీయ రహదారి ప క్కనే ఉండటం, రైల్వే సదుపాయం కూడా ఉందన్నారు. పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేంకు అర్కియాలజీ డిపార్టుమెంట్ అధికారులతో ఇటీవలే సంబంధిత అధికారులు ఆలయాన్ని సందర్శించి పర్యాట కులకు కావల్సిన సౌకర్యాలు నివేదించరన్నారు. ఆలయం పక్కన గల చెరువులో బోటింగ్ సదుపాయం, పిల్లల పార్కు, ఏర్పాటు చే సేందుకు చర్యలు తీసుకంటామని బాసరా వెళ్లే భక్తులు ఈ రామా లయం ముందుగా సందర్శించేలా అందుకు అనుగుణంగా ఏర్పా ట్లు చేయిస్తామని తెలిపారు. 14 నెలల కాంగ్రెస్ ప్రభుత్వకాలంలో ఇచ్చిన హామీలను నిలుపుకుందన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఎ న్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని నిజాంసాగర్, శ్రీరాం సాగర్, రూరల్ నియోజకవర్గంలో గుండారం అనంత పద్మనాభస్వామి, రా మడుగు ప్రాజెక్టు సందర్శించే పర్యటకులకు కావల్సిన సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ అపురూప ఖిల్లా రామాలయం సంస్కృతి సంప్ర దాయాలను భవిష్యత్తుతరాలకు తెలియజేసేలా పురాతన ఆలయాలను కాపాడేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి అన్నారు. రామాలయంపై కల్యాణ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రామాలయం పై ల్యాండ్ స్కేపింగ్, అండ్ గ్రీనరి ఏర్పాటు చేయడంతో పాటు చెరువులో బో టింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రానున్న మార్చి నాటికి రామాలయ అభివృద్ధికి తాను కూడా భాగస్వామ్యం అవుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరుపున టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజానికి ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ ఛైర్మన్ జంగం శాంతయ్య, వీడీసీ ఛైర్మన్ బూస సుదర్శరన్, టీపీ సీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతి నిధులు వాసుబాబు, గడ్డం నర్సారెడ్డి, జితేందర్, పోశెట్టి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

మాగాశుద్ధ త్రయోదశి సోమవారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సీతరామచంద్ర స్వామి కల్యాణం కన్నుల పండుగగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు సుమిత్ శర్మ దేశ్ పాండే ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా దంపతులు అందజేశారు. అనంతరం స్వామి వారికి నిత్యహోమం బలిహరణం, అశ్వసేవ, నివేదన, హరతి మంత్ర పుష్పం కార్యక్ర మాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు భూమయ్య లక్ష్మీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయించారు.

రామాలయం పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ఖిల్లా డిచ్‌పల్లి రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆలయ కమిటీ ఛైర్మన్ శాంతయ్య, సభ్యులు, వీడీసీ కమిటీ భూస సుదర్శన్, నర్సారెడ్డి పర్యాటక అభివృద్ధి ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కమిటీ సభ్యుల సూచన మేరకు ఎమ్మెల్యేతో కలిసి పటేల్ రమేశ్‌రెడ్డి చెరువును ఆలయ కట్టడాలను పరిశీలించారు.



విద్యుత్ దీపాలతో ధర్మారం క్యాథలిక్ చర్చ్

నేటి నుంచి లూర్దుమాత ఉత్సవాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీయేటా ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ధర్మారం క్యాథలిక్ చర్చ్‌లో లూర్దు మాత ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చర్చి నలు వైపులా రంగు రంగుల వి ద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వేడుకలను ఏర్పాట్లను దగ్గ రుండి పర్యవేక్షిస్తున్నారు. క్రైస్తవులకు ప్రార్థనలు చేసేందుకు చర్చిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు చర్చి ప్రతినిధులు వికాస్, సురేశ్, శిలువయ్య, పాల్గొన్నారు.



యేసు క్రీస్తు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అపూర్వం.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● పూర్వ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

రామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1983-84వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 40 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారికి చదువు నేర్పిన గురువులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించి వారికి పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులైనటువంటి 40 సంవత్సరాల తర్వాత చదువుకొని కలుసుకున్న సందర్భంగా ఒకరినొకరు పరిచయం చేసుకొని వారి జీవితం రీత్యా పరిచయం చేసుకొని మాట్లాడుకోవడం జరిగింది. వారితో చదువు కున్నటువంటి కొంతమంది విద్యార్థులు మృతి చెందడంతో వారికి ఒక్క నిమిషం పాటు మౌనం పాటించి వారికి శాంతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను ఉద్దేశించి మాట్లాడారు. మీరు చెప్పిన విద్యా బోధన ద్వారానే మేము ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్నామని గుర్తు చేశారు. అనంతరం గురువులు మాట్లాడారు అప్పుడు చెప్పినప్పుడు కొంచెం మీకు బాధలా ఉండవచ్చు కానీ పూర్వా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం పాల్గొన్నందుకు మాకు చాలా ఆనందంగా ఉందని అంతేకాకుండా మమ్ములను గుర్తుపెట్టుకుని ముఖ్యఅతిథిగా పిలిచిన విద్యార్థులను అభినందించారు. 40ఏళ్ల తర్వాత కూడా మమ్ములను గుర్తుపెట్టుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈవో వెంకటి, మాజీ ఉపాధ్యాయులు డి.తిరుపతి రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థులు రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, పి.లింగమూర్తి, ఎల్. రవి, భిక్షపతిరెడ్డి, ఎస్, గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, నారెడ్డి శోభారాణి, మున్నూరు కాపు మండల నేత కాల హనుమాడ్లు, జి. వినోద, ఎస్. విజయ, బలరాం, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున కన్నాపూర్ తండా మూలమలుపు

● చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

రామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యో తి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం కన్నాపూర్ తండా మూల మలుపు ప్రమాద రోడ్డుగా మారుతోంది. అతి వేగంగా పెద్ద, చిన్న వాహ నాలను నడపడంతో ఎప్పుడు ఏమీ జరుగుతుందో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సంద ర్శించినా అధికారులు పట్టించుకుని తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన వేల్పూర్ పోలీస్ క్వార్టర్‌ల భవనాలు

● కూలడానికి సిద్ధంగా ఉన్న పోలీస్ క్వార్టర్‌లు

● పట్టించుకోని పాలకులు, అధికారులు

వేల్పూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో నిర్మించిన పోలీస్ క్వార్టర్‌ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ భవనాలు శిథిలావస్థకు చేరడం వల్ల ఎప్పుడు కూలిపోతాయేనన్న భయాందోళనతో పోలీసులు ఎవరు కూడా ఆ భవనాల్లో ఉండడంలేదు. దీంతో భవ నాలు పూర్తిగా ముళ్ళ పొదలు, పిచ్చిమొక్కలు, చెట్ల తో నిండిపోయి బూత్ భవనాలుగా మారాయి. అయిన ప్పటికీ పాలకులు, అధికార యంత్రంగం చూసీచూడ నట్టుగా వ్యవహరిస్తున్నారని, విమర్శలు వ్యక్తమవుతున్నా యి. 2002 ఏప్రిల్ 9వ తేదీన అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, ఎస్సై భవనంతో పాటు పోలీస్ క్వర్టర్‌ల భవనా లను ప్రారంభించారు. లక్షలాది రూపాయలతో ఈ భవ నాలు అప్పట్లో నిర్మాణం చేపట్టినప్పటికీ భవనాలను పి ల్లర్లతో నిర్మాణం చేపట్టకుండా కేవలం ఇటుకలు, సిమెం ట్‌లతో చేపట్టారు. దశబ్దాల తరబడి ఉండాల్సిన పోలీస్ క్వర్టర్‌ల భవనాలు కొన్నళ్ళకే శిథిలావస్థకు చేరి కూలడా నికి సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాలు ప్రారంభోత్సవం చేసిన మొదట్లో కొన్ని సంవత్సరాలు పాటు ఆ భవనాలు కుటుంబసభ్యులతో ఉన్నారు. కొన్నేళ్ళకే ఆ భవనాలు శిథిలావస్థకు రావడం, వాటికి మరమ్మతులు చేపట్టక పోవడం వంటి సమస్యలతో పోలీసులు ఎవరు కూడా ఆ భవనంలో ఉండడానికి ఇష్టపడలేదు. దీంతో భవనాల గోడలు బీటలు వారి స్లాబ్ పెచ్చులు ఉండాయి. కిటికీ లు, దర్వాజలు, తలుపులు పూర్తిగా తుప్పుపట్టి పోయి ఊడిపోయాయి. వర్షాకాలంలో గోడలు వర్షపు నీటితో తడిసి ముద్దవుతుంటాయి. బాత్‌రూంలతో పాటు ఫ్లోరింగ్ కుంగిపోయి అధ్వాన స్థితికి చేరింది. అప్పట్లో నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లనే ఈ దుస్థితి చేరిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్మించిన పది పోలీస్ క్వర్టర్ భవనాలు పాములు, పందులు, కుక్కలకు నిలయాలుగా మారాయి. గత్యంతరం లేక కొంత మేరకు బాగున్న ఒకటి రెండు క్వర్టర్ భవనాల్లో మాత్రమే పోలీ సులు అప్పుడప్పుడు సేదా తీర్చుకుంటూ భోజనం చేయ డానికి వాడుకుంటున్నారు. ఒక ఎస్సై భవనం, పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరినప్పటికీ పాలకులు, అధికారులు ఎవరు కూడా పట్టించుకోకపోవడం పట్ల మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవచూపి శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్ భవనాలను తొలగించి అదే స్థానంలో పిల్లర్లతో నాణ్యమైన పోలీస్ క్వర్టర్‌ల భవనాలు, ఎస్సై భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు అంటున్నారు.





ముళ్లపొదలు, చెట్ల మధ్య అధ్వానంగా మారిన పోలీస్ క్వార్టర్ భవనాలు




విరిగిపోయిన గదుల కిటికీలు, తలుపుల దృశ్యం



అధ్వాన స్థితికి చేరిన ఎస్సై భవనం

కనువిందు చేస్తున్న పిట్ట గూళ్లు

రామారెడ్డి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో చెట్లకు అంటుకుని కనిపిస్తున్న పిట్టల సంరక్షణ దృశ్యాలు అందరికీ ఆకట్టుకుంటు న్నాయి. ఎండాకాలం, వర్షా కాలం వ్య వసాయ పొలాల్లో, చెరువులు, వాగుల వద్ద ఇలాంటి దృశ్యాలు ఎక్కువ కనిపిస్తుండగా మండల కేంద్రంలో ఇలాంటివి ఆకట్టుకునే దృశ్యాలు ప్రజలకు కనిపించడం చాలా అదృష్టంగా భావి స్తున్నారు.



రామారెడ్డి మండల కేంద్రంలో కనువిందు చేస్తున్న పిట్టల సంరక్షణ దృశ్యాలు

ప్రయోగ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఐఈవో



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో రవికుమార్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియెట్ ప్రయోగపరీక్ష కేంద్రాలను సోమవారం డీఐఈవో రవికుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెండవ విడత ప్రయోగ పరీక్షలో భాగంగా నగరంలోని వెక్టర్, ఎస్ఆర్, నారాయణ జూనియర్ కళాశాలల ప్రయోగ పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పరీక్ష కేంద్రంలో కెమెరాకు జియో ట్యాగింగ్ చేయడం జరిగిందని కెమెరాలు ఆగిపోకుండా ఎప్పటికప్పుడూ తనిఖీలు చేస్తూ అవి పనిచేసేలా చూడాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని లైవ్ కెమెరాల ద్వారా హైదరాబాద్ నుంచి ఇంటర్ విద్యాశాఖ కమీషనర్ పర్యవేక్షణ చేస్తున్నారని ఆయన తెలిపారు.

కరీంనగర్‌కు తరలిన జిల్లా కాంగ్రెస్ నాయకులు



పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి సోమవారం కరీంనగర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు సునీల్‌రెడ్డి, వినయ్ రెడ్డి, సిరికొండ గంగారెడ్డి తదితరులు కరీంనగర్ వెళ్లారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు నేతలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

వర్సిటీలో ఆరోగ్య విద్యను ప్రోత్సహించాలి



టీయూలో అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం-సూర్య ఆరోగ్య సంస్థ మెమోరెండం ఆఫ్ అండర్ స్టడీంగ్ అవగాహన ఒప్పంద పత్రాలపై సోమవారం, వీసీయాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి, సూర్యస్ హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ చేకూరి ఉదయ సూర్య భగవాన్, రాజేంద్ర కుమార్ విక్రమ్ అవగహన ఒప్పంద పత్రా పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సూర్య భగవాన్ మాట్లాడుతూ.. సూర్యస్ హెల్త్ ఆర్గనైజేషన్ లాభాపేక్ష లేకుండా చారిటేబుల్ ట్రస్ట్ 1982నుంచి ఆరోగ్య సేవల ద్వార ప్రజారోగ్యం మెరుగు పర్చడానికి కృషి చేస్తుందన్నారు. మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ వైద్య విద్య తెలంగాణ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ సపోర్టు సెంటర్ ఏర్పాటు చేసి సమగ్ర విద్యార్థి ఆరోగ్య అభివృద్ధికి ఈ సంస్థ మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వీసీ యాదగిరి రావు మాట్లాడుతూ.. యుజీసీ మార్గదర్శకాలను కట్టుబడి ఆరోగ్య విద్య కార్యకలపాలు నిర్మాణాత్మక సంస్కరన కార్యక్రమాలు, మాన సిక భావోద్వేగా శ్రేయస్సు సెంపొందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.ఘంట చంద్రశేఖర్, ప్రొ.అంజనేయులు, సూర్య ఆరోగ్య సంస్థ ప్రతినిధులు రవితేజ, రాజేశ్వరి, అంజయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కొండూర్ వాగులో ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న అధికారులు

సిరికొండ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) కొండూర్ వాగులో ఇసుకను నింపుతున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.కొండూర్ గ్రామ సమీపాన గల రెండో వాగులో ఇసుకను నింపుతున్నారని అందిన సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాస గంగారాజం వెళ్లి రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పంచానామ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. సర్పల్లి తండా కు చెందిన మాలవత్ బాలాజీ,మాలవత్ భాస్కర్‌కు చెందిన ట్రాక్టర్లని ఏఎస్సై బాల్‌సింగ్ చెప్పారు. పై ఇద్దరితో పాటు ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్ పిట్లరాజు పై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగారాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు బాల్‌సింగ్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలించవద్దు మండలంలోని ఏ గ్రామానికి చెందిన వారైన ప్రభుత్వం నుంచి అనుమతిని పొందిన తర్వాతనే ఇసుకను తరలించాలని ఏఎస్సై బాల్‌సింగ్ ట్రా క్టర్ల యజమానులకు సూచించారు. అనుమతి లేకుండ ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

జాతీయ రగ్బీ క్రీడలకు

ఎంపికైన సిరికొండ విద్యార్థి

సిరికొండ ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) ఈనెలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి రగ్బీ క్రీడలకు సిరికొండ విద్యార్థి చిన్నా ఎంపికయినట్లు పాఠశాల పీ.డీ ప్రశాంత్ తెలిపారు.ఈ నెల 2,3,4 తేదీలలో మంచిర్యాల పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడల పోటీల లో సిరికొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుచున్న చిన్నా క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించినందున జాతీయ స్థాయి క్రీడల పోటీలకు ఎంపికయ్యారని ప్రశాంత్‌తెలి పారు.చిన్నాను సోమవారంపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భోజరాం సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఎగిరిన కాషాయ జెండా గల్లీలోనూ ఎగరాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన బీజేపీ గల్లీలో ఎగిరే వరకు కార్యకర్తలు విశ్రమించవద్దని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారా యణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో సోమ వారం ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్‌షాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామా బాద్, మెదక్ పట్ట భద్రుల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించే విధంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. గత, ప్రస్తుత ప్రభు త్వం నిరుద్యోగులను నిండా ముంచాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఉద్యోగాలు ఇస్తామంటే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఒక్క నోటిఫికేషన్ వేయలేదన్నారు. గత ప్రభుత్వం 3వేల నిరు ద్యోగ భృతి అని చెప్పి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 4వేలు ఇస్తా మని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతుందన్నారు. ప్రశ్నించే గొంతుకలైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, నాయకులు నాగొళ్ల లక్ష్మీనారాయణ, కొండ ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై ప్రతిపక్షాల అనవసర రాద్ధాంతం

● రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో బీసీ కులగణన శాస్త్రీయంగా జరిగిన ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాహల్ గాంధీ సూచనల మేరకు బీసీలకు న్యాయం జరిగేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేసిందని అన్నారు. జాతీయ చేనేత ఐక్యవేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం సోమవారం నగరంలోని పద్మశాలీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ కులగణన చేయని బీజేపీ పార్టీ ఈరోజు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం శోచనీయమని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేయలేదో చెప్పాలన్నారు. చేనేత రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనిస్తుందని త్వరలోనే చేనేత తదితర సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి వారి కష్టాలను దూరం చేయడానికి ప్రభుత్వం



మాట్లాడుతున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.గతప్రభుత్వాలు పద్మశాలీలకు ఏమి చేయలేదని ఎంపీగా అర్వింద్ సైతం పద్మశాలీలకు చేసింది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు తస్నీరు శ్రీని వాస్, శ్రీనివాస్,యాదగిరి,దత్తాద్రి, పుల్గంహన్మాండ్లు, గుజ్జరాజేశ్వరి పాల్గొన్నారు.

ఏకలవ్య శిక్షణ గిరిజన కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

● రాష్ట్ర ఎరుకల హక్కుల ఐక్య పోరాట సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సాయికుమార్

మోర్తాడ్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎరుకల(గిరిజన) కార్పొరేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రూ.1000కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర ఎరుకుల హక్కుల ఐక్య పోరాట సాధన సమితి అధ్యక్షుడు కోనేరు సాయికుమార్ కోరారు. సోమవారం మోర్తాడ్‌లో మండల స్థాయి ఎరుకల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎరుకల సంఘం సభ్యులు పాల్గొన్నారు.ఈసందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షుడు పింగసరం విక్రం, ఉపాధ్యక్షుడు కుర్ల బోజన్న, ప్రధాన కార్యదర్శి కుర్ల శ్రీనివాస్, సహయ కార్యదర్శి కుర్ల రాజు, కోశాధికారి వడ్డి కనక రాజు, కార్యవర్గసభ్యుడిగా పింగసరం వెంకటేష్, పోశెట్టి, రంజిత్, నర్సయ్య, కావడి చిన్న గంగారాం, తదితరులను ఎన్నుకున్నారు. ఈ



సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

మండల కమిటీ ఎరుకల సమస్యలపై పోరాడాలని ఇలాంటి సమస్యలు తమదృష్టికి తీసుకు రావాలని కోనేరు సాయికుమార్ అన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి

సిరికొండ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని లప్పుడే తల్లి దండ్రుల కలలను నెరవేర్చిన వారవు తారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు వజ్జా నవనీత అన్నారు. సోమవారం సిరికొండ మోడల్ స్కూల్లో జరిగిన సెమినార్‌లో ఆమే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మిమ్మల్ని కన్న తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకుని చదివిస్తారని అన్నారు. వారి కళల్ని నెరవేర్చాలంటే పాఠశాలలో గురువులు బోధించే విద్యా బుద్ధులను చక్కాగా ఆలకించి అర్థం చేసుకోవాలన్నారు. పరీక్షలు రాగానే ఉన్నత మైన లక్ష్యాన్ని ఎంచుకుని పరీక్షలకు ప్రిపేర్ కావాలని కోరారు. లక్ష్యం లేకుండా ప్రయాణం చేస్తే అనుకున్న గమ్యాన్ని చేరుకోలేమని నవనీత గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే అనుకున్నది సాధించి తల్లిదండ్రుల కళల్ని నిజం చేసినవార వుతారని హితవు చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడుతూ మహిళ సాధికారత పై వారికున్న సందేహాలను నవనీత నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షల పట్ల గల బయాన్ని, అనేక అనుమానాలను పోగొట్టడం కొరకు వారిలో గల



వ్యక్తిత్వ వికాసంపై జరిగిన సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆమన్యూనత భావాన్ని తొలగించి మనో ధైర్యాన్ని నింపడం కొరకు వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా లక్ష్మి నర్సింహస్వామి కల్యాణం

ఎడపల్లి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జానకం పేట గ్రామ శివారులో గల లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ బ్రహోత్సవాలు ఈ నెల 5న ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీలక్ష్మి నర్సింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణం సందర్భంగా ఆలయ పూజారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి విగ్రహ మూర్తులతో పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మి నర్సింహస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

వేల్పూర్ ఫాస్టర్‌ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం ఫాస్టర్‌ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని పడిగెల గ్రామంలో జీసెస్ క్రైస్ట్ ప్రేయర్ ఏజీ చర్చిలో మండల ఫాస్టర్‌ల సమావేశాన్ని నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఫాస్టర్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఫాస్టర్ నోవా (జాన్కంపేట్), ఉపా ధ్యక్షుడిగా ఫాస్టర్ రవిపాల్(వేల్పూర్), కార్యదర్శిగా ఫాస్టర్ ఇసాక్ (అంక్సాపూర్), సహాయ కార్యదర్శిగా ఫాస్టర్ జీ.లాజర్ (కొత్తపల్లి), కోశాధికారిగా ఫాస్టర్ చిట్టిబాబు (అంక్సాపూర్, సలహదారులుగా సియోన్‌కుమార్, ప్రేమ్ కుమార్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేల్పూర్ మండల ఫాస్టర్‌లకు, క్రైస్తవు లకు అందుబాటులో ఉండి సంక్షేమం, అభివృద్ధికి అన్ని విషయాల్లో అందు బాటులో ఉంటానని ఫాస్టర్ నోవా తెలిపారు. ఈ కార్యక్రమంలో మం డలంలోని వివిధ గ్రామాల ఫాస్టర్‌లు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచారం జన్మదిన వేడుకలు

కోటగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కోటగిరి, పొతంగల్ మండలంలో సోమవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్,షాహీద్, దిగంబర్,మధు పాల్గొన్నారు.

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి 76వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పార్వతి ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అడప సాయిలు, పత్తి రాము, అక్కపల్లి నాగేందర్, పత్తి లక్ష్మణ్, నెరుగంటి బాలరాజు, తోట సంగయ్య, సుదర్శన్ గౌడ్, అనీల్ పటేల్, షేక్ నిస్సార్, షేక్ ఖాదర్, సంజీవులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్ని: పోచారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం వర్ని మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కాలం చెల్లిన మందులను అమ్మితే చర్యలు తప్పవు



ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఇందల్వాయి,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ దవాఖానాల్లో కాలం చెల్లిన మందులను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ సోమవారం ఆకస్మికంగాతనిఖీచేశారు. ఆసుపత్రిలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. జాతీయ తీగ నివారణ కార్యక్రమంలో భాగంగా టీకాల రిఫ్రిజిరేటర్‌లను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు చేస్తున్న రక్త పరీక్షల గురించి ల్యాబ్ టెక్నిషియన్ అనిత రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజు రోగులకు ఇచ్చే మందుల వివరాలను ఫార్మసిస్టు విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కాలం చెల్లిన మందులు ఉన్నట్లయితే ఆ మందులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇన్‌పేషెంట్ వార్డును పరిశీలించి గర్భిణీ స్త్రీల వివరాలను అడిగి ఐరన్ షుక్రోస్ ఇంజెన్ ఇవ్వడాన్ని పరిశీలించారు. రోగులకు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారి సుశాంత్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు డాక్టర్ భువన, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు సులభతరం

సుభాష్‌నగర్,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి):వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడంలో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేశామని నిజామా బాద్ సర్కిల్ సూపరింటెండెంట్ రవీందర్ సోమవారం ఒక ప్రక టనలో తెలిపారు. వినియోగదారులు కొత్త సర్వీసు మంజూరులో ఏదైనా దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారులు తగు విధంగా స్పందించడానికి మరొక అవకాశం కల్పిస్తున్నామన్నారు. కొత్త సర్వీసుల మంజూరు ఆలస్యం కాకుండా ఉండేందుకు విని యోగదారునికి దరఖాస్తు చేసుకున్న దానిపై మెస్సేజ్ రూపకంగా ప్రతి ఒక్క దశలో మొబైల్ ఫోన్‌కు వెళ్తుందన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకొని నిర్దిష్టమైన సమయంలో దరఖాస్తులను సమ ర్పించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారుడు తన దరఖాస్తు స్థితిని తెలుసుకోవడానికి ట్రాకింగ్ చేసే వెసులు బాటు కల్పించామన్నారు. వినియోగదారుడు మరింత సమాచారం కోసం 1912 నెంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

దౌర్జన్యంగా ఇంటిని కూల్చేశారని ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో తమ ఇళ్లను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్యాయంగా కూల్చివేశారని బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. తాము ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇంటిని వీడీసీ సభ్యులు కూల్చివేశారని ఈ విషయంలో న్యాయం చేయాలని కోరారు. అనంతరం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత 35 ఏళ్లుగా నల్లవెల్లి గ్రామంలో గాడిదలపై ఇసుక, మొరం, మట్టి తరలిస్తూ ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలు, చెరువు కట్టల నిర్మాణాల్లో కీలక పాత్ర పోషించామని ప్రస్తుతం ట్రాక్టర్లు, టిప్పర్లు రావడంతో తమ వృత్తి పూర్తిగా అంతరించిపోయి కూలీ పని చేస్తున్నామని 20ఏళ్ల క్రితమే పట్టాభూమిని కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేసుకున్నామని కానీ గ్రామానికి చెందిన కొంత మంది వీడీసీపై ఒత్తిడి తెచ్చి తమ రేకుల షెడ్డును కూల్చివేశారని బాధితురాలు చౌహాన్‌లక్ష్మి తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

వరదకాలువలో

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



వీర్‌సింగ్ (ఫైల్)

ముప్కాల్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ వరదకాలువలో ప్రమాదవశాత్తు ఆదివారం వీర్‌సింగ్(36) కాలు జారీ గల్లంత య్యాడు. వరదకాలువలో వీర్‌సింగ్ మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాల్కొండ మండలం బస్సాపూర్ గ్రామంలో గత కొంత కాలంగా బతుకు దెరువు కోసం మెస్త్రీగా పని చేస్తున్న చత్తీష్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వీర్ సింగ్ ఆదివారం సాయంత్రం ముప్కాల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా వరద కాలువ కెనాల్‌పై గల లక్ష్మీకాలువ సైడ్‌వాల్ నుంచి షాట్‌కట్‌లో బస్సాపూర్ కు వెళ్తుంగా ప్రమాదవశాత్తు జారీ వరదకా లువలో పడిపో యాడు. దీంతో వరదకాలువ గేట్లు నీటి ప్రవాహం నిలిపివేయగా సోమవారం ఉదయం వీర్‌సింగ్ మృత దేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు తమ్ముడు బీద్‌మాన్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఠాగూర్‌సింగ్ హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.180	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	: రూ.190	రూ.260	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.87,100	రూ.80,400	రూ.995

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్ర్కీన్-2 : పట్టుదల (10.05, 1.15, 4.25, 7.35, 10.45)
స్ర్కీన్-3 : స్కైఫోర్స్ (హిందీ) (10.15)
: డాకూ మహారాజ్ (1.00, 7.20)
: దేవ (హిందీ) (4.05, 10.25)
స్ర్కీన్-4 : దేవ (హిందీ) (10.00, 7.10)
: స్కైఫోర్స్ (హిందీ) (1.15, 10.25)
: మద గజ రాజ (4.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : తండేల్ (1.20, 4.15, 7.15, 10.00)
స్ర్కీన్-2 : తండేల్ (11.00)
: సంక్రాంతికి వస్తున్నాం (1.45, 7.30)
: సనం తేరీ కసం (హిందీ) (4.30, 10.10)
స్ర్కీన్-3 : సనం తేరీ కసం (హిందీ) (1.40, 7.30
: పట్టుదల (4.40, 10.30)

దేవి : డాకుమహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : బాదాస్ రవికుమార్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్